నల్లాల నుంచి దుంకిన మిషన్ భగీరథ!

- మరమ్మతులు చేసిన మున్సిపల్ అధికారులు
- భగీరథ నీళ్లు రావడంతో 'నమస్తే'కు స్థానికుల కృతజ్ఞతలు

నమస్తే ఎఫెక్ట్

అలంపూర్, ఫిబ్రవరి 19: జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లో నెలకొన్న నీటి ఎద్దడిపై 'మహబూబ్‌నగర్‌లో మళ్లీ ప్లాస్టిక్ బిందెలు' అన్న శీర్షికన సోమవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వార్త ప్రచురితమైనది. ఇందుకు అలంపూర్ మున్సిపల్ అధికారులు స్పందించారు. న్యూప్లాట్స్ కాలనీలోని బోర్లకు మర్మతులు ప్రారంభించారు. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలను సరిచేశారు. సాయంత్రం వరకు కాలనీలో కొన్ని ఇండ్లకు నీటిని సరఫరా చేశారు. దీంతో స్థానికులు 'నమస్తే' దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు. మిషన్ భగీరథ నల్లాల సంఖ్య పెరగడంతో చివరి ఇంటి వరకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నదని మున్సిపల్ సిబ్బంది తెలిపారు. పైపుల సైజు పెంచాలని, అక్కడక్కడా ఎయిర్ వాల్వ్స్ ఏర్పాటు చేస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని వారు వివరించారు.

అలంపూర్‌లోని న్యూప్లాట్స్ కాలనీలో బోరుకు మరమ్మతు చేయిస్తున్న సిబ్బంది; లీకేజీలను సరిచేయడంతో మిషన్ భగీరథ నల్లా నుంచి వస్తున్న నీటిని పట్టుకుంటున్న మహిళ

తాగునీటి కోసం మహిళల ఆందోళన

- గ్రామ పంచాయతీ ఎదుట ఖాళీ బిందెలతో నిరసన
- వారానికోసారి సన్నగా వస్తున్నాయని ఆవేదన

చిగురుమామిడి, ఫిబ్రవరి 19: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో తాగునీటి కోసం మహిళలు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. తమకు వారం రోజులకు ఒకసారి తాగునీటిని సరఫరా చేస్తున్నారని, అదికూడా సన్నగా వస్తున్నదని, దీనివల్ల చాలా రోజులుగా నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి కోసం చాలా దూరం వెళ్లాల్సివస్తున్నదని మండిపడ్డారు. ఈ విషయాన్ని గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ ఇప్ప నరేందర్ దృష్టికి తీసుకెళ్లగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు.

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరిలో ఆందోళన చేస్తున్న మహిళలు

ఇసుక అక్రమ రవాణాకు అడ్డాగా ఆకేరువాగు

- వాగు పరీవాహక ప్రాంతాల్లో చెలరేగుతున్న అక్రమార్కులు
- సమాచారం అందిస్తే చర్యలు: ఎస్ఐ

జఫర్‌గఢ్, ఫిబ్రవరి 19: జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలంలోని ఆకేరువాగు పరీవాహక ప్రాంతం ఇసుక అక్రమ రవాణాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. ఉప్పుగల్లు శివారులో ఆకేరువాగుపై రిజర్వాయర్ నిర్మాణంతో కొన్ని నెలలుగా స్తబ్దుగా ఉన్న ఇసుక రవాణా ఇటీవల మళ్లీ ఊపందుకున్నది. ఉప్పుగల్లు, కూనూరు, కోనాయిచలం, తిడుగు గ్రామ శివారులో ఆకేరువాగు పరీవాహక ప్రాంతం కావడంతో ఇసుక లభిస్తున్నది. ఉప్పుగల్లు శివారులో ఆకేరువాగుపై బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.270 కోట్లతో రిజర్వాయర్ నిర్మించింది. అంతకుముందు రిజర్వాయర్ ప్రాంతంలోని ఇసుకను అక్రమార్కులు కొన్నేండ్లపాటు అక్రమంగా తరలించారు. ఆ తర్వాత రిజర్వాయర్ నిర్మాణం పూర్తయి నీటితో నిండడంతో ఇసుక రవాణకు అడ్డుకట్ట పడింది. గత వానకాలంలో వర్షాలు కురిసి వాగులోకి ఇసుక కొట్టుకురావడంతో అక్రమార్కుల కన్ను మళ్లీ ఇసుకమేటలపై పడింది. యథేచ్ఛగా ఇసుకను కొల్లగొడుతున్నారు. ఇసుకను తరలించుకుపోవడంతో ఆకేరువాగు పరీవాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. బోర్ల నుంచి నీళ్లు రావడం లేదని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు.

కఠిన చర్యలు తప్పవు: మహేందర్, ఎస్ఐ

ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆకేరువాగు నుంచి ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 20 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశాం. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తుంటే పోలీసులకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటాం.

ఉప్పుగల్లు ఆకేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు(ఫైల్)

రైతుబంధుకు ఉపగ్రహ సర్వే

మొదటిపేజీ తరువాయి...

ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఢిల్లీకి వెళ్లి అక్కడి ఉన్నతాధికారులతో చర్చలు జరిపినట్టు సమాచారం. సర్వేకు ఎన్ఆర్ఎస్ఈ సూత్రప్రాయ అంగీకారం తెలపడంతో త్వరలోనే ఇందుకు సంబంధించిన కార్యకలాపాలను ప్రారంభించనున్నట్టు తెలిసింది. వచ్చే వానకాలం నుంచి రైతుభరోసా అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో ఆ లోపు వివరాలన్నీ సేకరించేలా వ్యవసాయ శాఖ కార్యాచరణ చేపట్టింది. భూముల వివరాలు రాగానే కొత్త మార్గదర్శకాలు రూపొందించే అవకాశం ఉన్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు ద్వారా ఎకరాకు రూ.10 వేల చొప్పున పెట్టుబడి సాయం అందించగా కాంగ్రెస్ పార్టీ ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో 1.52 కోట్ల ఎకరాలకు ఏటా దాదాపు రూ.23 వేల కోట్ల బడ్జెట్ అవసరమని అంచనా.

మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం జయ్యారం గ్రామ శివారు వాగులో ఇసుక తవ్వకాలు

రాత్రికి రాత్రే తవ్వేస్తున్నారు!

- మానుకోట జిల్లాలో జోరుగా ఇసుక దందా
- వాగుల నుంచి అక్రమంగా తరలిపోతున్న ఇసుక
- నిమ్మకు నీరెత్తినట్టు అధికారులు

మహబూబాబాద్, ఫిబ్రవరి 19(నమస్తే తెలంగాణ): జిల్లాలో ఇసుకదందా యథేచ్ఛగా సాగుతున్నది. అక్రమార్కులు రాత్రికి రాత్రే వాగులో ఇసుకను తవ్వి ట్రాక్టర్ల ద్వారా జిల్లాకేంద్రంతోపాటు తొర్రూరు, దంతాలపల్లి, నర్సింహులపేట, చిన్నగూడూరు, మరిపెడ వంటి ప్రాంతాలకు తరలించి జేబులు నింపుకొంటున్నారు. జిల్లాలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచందర్‌నాయక్ అధికారులకు పదేపదే సూచనలిస్తున్నప్పటికీ తవ్వకాలకు మాత్రం అడ్డుకట్ట పడడంలేదు. నర్సింహులపేట మండలంలోని కౌసల్యదేవిపల్లి, బొజ్జన్నపేట, కొమ్ములవంచ, జయపురం గ్రామ శివారులో ఉన్న వాగులో అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున నాలుగు గంటల వరకు తవ్వకాలు జరిపి ఇసుకను అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఇదే మండలంలో గతంలో స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు ఇసుక డంపులు సీజ్ చేసి వేలం వేశారు. ఇప్పుడు మాత్రం అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదు. చిన్నగూడూరు, మరిపెడ, డోర్నకల్, బయ్యారం మండలాల్లోని వాగుల నుంచి కూడా ఇసుక అక్రమంగా తరలిపోతున్నది. ముల్కలపల్లిలోని ఆకేరువాగు నుంచి ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వందలాది ట్రాక్టర్లు ఇసుకను తరలిస్తున్న విషయం తెలిసీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా అధికారులు నిఘాపెట్టి అక్రమార్కుల భరతం పట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

సర్కారు క్వారీ.. ప్రైవేటు స్వారీ

మొదటిపేజీ తరువాయి...

మేరకు క్వారీల వద్ద ఇసుక లోడ్ చేస్తారు. ప్రభుత్వం పెట్టిన తాజా నిబంధన కారణంగా డీడీలు తీసినా దోపిడీ తప్పడం లేదు. డీడీల మొత్తానికి అదనంగా రూ. 1000 నుంచి రూ. 3000 వేలు ఇస్తేనే క్వారీల్లో ఇసుక లోడ్ చేస్తున్నారు. కొత్తగా ఇసుక తవ్వకాలు లేకపోవడంతో చేసేది లేక లారీల యజమానులు అడిగిన మొత్తం చెల్లించుకుంటున్నారు. ఈ దందా కారణంగా మార్కెట్లో ఇసుక ధర సామాన్యులు మోయలేనంత భారంగా మారుతున్నది.

బంగారుబాతులా

పల్గుల గుండ్రాత్‌పల్లి క్వారీ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలోని పల్గుల గుండ్రాత్‌పల్లి క్వారీలో ఇసుక నాణ్యంగా ఉంటుంది. స్లాబ్‌లకు, గిలాబ్‌కు ఇక్కడి ఇసుకను వాడుతుంటారు. గత ఎండాకాలంలో రీచ్‌ల నుంచి తవ్వి సమీపంలోని క్వారీలో ఇసుక నిల్వ చేసి పెట్టారు. నాణ్యమైన ఈ ఇసుక ఇప్పుడు అధికారులు, కాంట్రాక్టర్లకు బంగారుబాతులా మారింది. రెండువారాల క్రితం ప్రతి రోజు ఇక్కడి నుంచి 350 లారీలు ఇసుకను రవాణా చేసేవి. ఇప్పుడు ఆ సంఖ్య 530కి పెరిగింది. ఆ మేరకు అధికార పార్టీ నాయకులు, అక్కడి అధికారి జేబులు నింపుకొంటున్నారని లారీ యజమానులు ఆరోపిస్తున్నారు. పలుగుల 6, పలుగుల(గుండ్రాత్‌పల్లి), పలుగుల 5, పలుగుల 10, పలుగుల 7 (మద్దులపల్లి) క్వారీల నుంచి ఇసుక ఎక్కువగా రవాణా అవుతున్నది. సోమవారం పలుగుల గుండ్రాత్‌పల్లి క్వారీకి 130 లారీలు రాగా 4 వేల టన్నుల ఇసుక లోడ్ చేశారు. పలుగుల 5 క్వారీకి వచ్చిన 90 లారీల్లో 3 వేల టన్నుల ఇసుక రవాణా అయింది. పలుగుల 6 క్వారీ నుంచి 70 లారీల్లో 2వేల టన్నుల ఇసుక రవాణా జరిగింది. పలుగుల 7(మద్దులపల్లి) క్వారీకి 120 లారీలు రాగా, 3 వేల టన్నుల ఇసుకను లోడ్ చేశారు. పలుగుల 10 క్వారీకి వచ్చిన 120 లారీల్లో 3500 టన్నుల ఇసుక రవాణా అయింది. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, పెద్దపల్లి, ఇతర సమీప జిల్లా కేంద్రాలు, పట్టణాలకు ఇక్కడి నుంచి ఇసుక రవాణా పెద్ద ఎత్తున జరుగుతున్నది. కాళేశ్వరం నుంచి వచ్చే సాధారణ ఇసుక వరంగల్‌లో టన్నుకు రూ. 900 ఉండేది. ఇప్పుడు రూ.1400కు పెరిగింది. రూ.1000 ఉండే నాణ్యమైన ఇసుక ధర ఇప్పుడు రూ.1800 వరకు పలుకుతున్నది. కొందరు డిమాండ్‌ను బట్టి అధిక ధరలకు అమ్ముతున్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో రేగు చెట్టు నుంచి వస్తున్న కల్లు

రేగు చెట్టు నుంచి కల్లు

- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో వింత ఘటన

కాటారం, ఫిబ్రవరి 19: ఈత చెట్టు.. తాటిచెట్టు నుంచో కల్లు రావడం సహజం. కానీ, రేగు చెట్టు నుంచి కల్లు వస్తున్న వింత దృశ్యం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో వెలుగుచూసింది. హమాలీ వాడకు చెందిన మహ్మద్ సలీం ఇంటి పక్కన ఉన్న రేగు చెట్టు నుంచి ఐదు రోజులుగా కల్లు లాంటి ద్రవం వస్తున్నది. అచ్చం తాటి కల్లుకు ఏ మాత్రం తీసిపోకుండా ఉందని స్థానికులు చెప్తున్నారు. మూడేండ్ల క్రితం సలీం రేగు మొక్కను నాటి, అది వంగకుండా ఇనుప వైర్‌తో కట్టాడు. మొక్క చెట్టుగా మారడంతో ఇనుప వైర్‌ను తీసేశాడు. వైరు కట్టిన ప్రదేశంలో ఏర్పడిన కాటు నుంచి ప్రస్తుతం కల్లు ఉబికి వస్తుండటంతో బాటిల్ కట్టాడు. ఐదు రోజులుగా రోజూ కొంత ద్రవం వస్తున్నది. దాని రుచి కూడా కల్లులాగా ఉండటంతో స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఉద్యానవన శాఖ అధికారులు మాట్లాడుతూ.. జన్యు పరివర్తనలో భాగంగా లక్షల్లో ఒక చెట్టుకు ఇలా జరిగే అవకాశం ఉందని తెలిపారు. లేదా అంటుకట్టే సమయంలో ఏదైనా పాలుకారే మొక్క భాగం ఉన్న వేప, రావి, రేగు చెట్లకు ద్రవం వస్తుందని వివరించారు.

పంట ఎండిందని రైతు ఆత్మహత్య

- నాలుగెకరాలు నాటేస్తే ఎకరంలో ఎండిపోయిన వరి
- మూడు బోర్లు వేసినా నీళ్లు పడలేదు
- సాగు, ఇతరాలకు 32 లక్షల అప్పులు
- వాటిని తీర్చేమార్గం లేక బలవన్మరణం
- జనగామ జిల్లా నారాయణపూర్‌లో విషాదం

బచ్చన్నపేట, ఫిబ్రవరి 19: కన్నబిడ్డలా సాకిన వరి పొలం కండ్లముందే ఎండిపోయింది. రైతు గుండె తల్లడిల్లింది. సాగు కోసం వేసిన బోర్లు, ఇతర ఖర్చులతో గుట్టలా పెరిగిన రూ.32 లక్షల అప్పు కుంగదీసింది. తీర్చే మార్గం కనిపించక ఉరే శరణ్యమనుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక రైతు ఉరేసుకున్నాడు. ఈ దారుణ ఘటన జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని నారాయణపూర్‌లో సోమవారం చోటుచేసుకున్నది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు పరిదె సాయిమల్లయ్య (42)కు నాలుగెకరాల పొలం ఉన్నది. గతంలో మూడు బోర్లు వేయగా నీళ్లు పడలేదు. ఏడాది క్రితం మరో రెండు బోర్లు వేసినా కొద్దిగా మాత్రమే నీళ్లు పడ్డాయి. ఈ యాసంగిలో నాలుగు ఎకరాల భూమిలో వరి నాటు వేశాడు. బోరు ఎత్తిపోవడంతో ఎకరం పొలం ఎండిపోయింది. గతంలో చేసిన అప్పులకు చెల్లి పెండ్లి కూడా తోడయింది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. సుమారు రూ.32 లక్షల వరకు అప్పులయ్యాయి. వాటిని తీర్చే మార్గం లేకపోవడంతో కుటుంబంలో తగాదాలు ఏర్పడ్డాయి. తీవ్ర మనస్తాపం చెందిన సాయిమల్లయ్య సోమవారం ఉదయం వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భూములు యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ పరిధిలో ఉండటంతో రాజపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆలేరుకు తరలించారు. మృతుడికి భార్య సరిత, ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారులున్నారు.

సాయిమల్లయ్య (ఫైల్)

రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంటలోని బిక్కవాగు బ్రిడ్జిపై ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

అన్నపూర్ణ నీటిని విడుదల చేయాలి

బిక్కవాగు బ్రిడ్జిపై బీజేపీ నాయకుల ధర్నా

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 19: రాజన్న సిరిసిల్ల జిల్లా అనంతగిరి శివారులోని అన్నపూర్ణ రిజర్వాయర్ నుంచి బిక్కవాగుకు నీటిని విడుదల చేయాలని బీజేపీ నాయకులు ఆందోళనకు దిగారు. సోమవారం ఇల్లంతకుంటలోని బిక్కవాగు బ్రిడ్జిపై బైఠాయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నీరందక యాసంగి పంటలు ఎండిపోతున్నాయని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే కాంగ్రెస్ సర్కారు స్పందించి నీటి విడుదలకు చర్యలు చేపట్టాలని కోరారు. నిరుడు ఎండకాలంలో అప్పటి ప్రభుత్వం అన్నపూర్ణ రిజర్వాయర్‌కు కాళేశ్వరం జలాలను తరలించి పంటలను కాపాడిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు.

40 మందిపై పిచ్చికుక్క దాడి

- మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో చికిత్స

మంచిర్యాల ఏసీసీ, ఫిబ్రవరి 19: మంచిర్యాల పట్టణంలోని రాంనగర్, ఎల్ఐసీ కాలనీల్లో సోమవారం ఓ పిచ్చి కుక్క రెచ్చిపోయింది. 40 మందిపై దాడి చేసి గాయపర్చింది. దీంతో గాయాలపాలైన వారు మంచిర్యాలలోని ప్రభుత్వ దవాఖానలో చేరారు. రెండు రోజుల క్రితమే పిచ్చికుక్క కాలనీల్లో తిరుగుతుందని స్థానికులు మున్సిపల్ అధికారులకు సమాచారం అందించినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చి కుక్కలు వార్డుల్లో తిరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు

PM SHRI KENDRIYA VIDYALAYA , MAHABUBNAGAR
Yenugonda, Mahabubnagar-509002 (Telangana).
MINISTRY OF EDUCATION , GOVERNMENT OF INDIA
Email: kvmahabubnagar2008@gmail.com, website:http//mahabubnagar.kvs.ac.in

WANTED STAFF ON CONTRACTUAL BASIS WALK IN INTERVIEW FOR A.Y. 2024-25

S.No.	POST	DATE	INTERVIEW TIMINGS	VENUE
1.	PGT : (English, Hindi, Maths, Physics, Chemistry, Biology, Computer Science) TGT : (English, Hindi, Maths, Science, Social, Sanskrit)	24-02-2024	From 09-00 AM to 02-00PM	PM SHRI KENDRIYA VIDYALAYA MAHABUB-NAGAR
2.	PRT : Computer Instructor, Sports Coach, Dance Coach, Student Counsellor, Special Educator, Staff Nurse			

Visit website for details : https://mahabubnagar.kvs.ac.in
Sd/- PRINCIPAL
PM SHRI KENDRIYA VIDYALAYA MAHABUBNAGAR

పంటి చికిత్సకు వెళ్తే ప్రాణం పోయింది!

- నిశ్చితార్థం మరుసటి రోజునే విషాదం
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
- డెంటల్ దవాఖాన నిర్వాహకులపై కేసు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 19: పంటి చికిత్స కోసం డెంటల్ దవాఖానకు వెళ్లిన యువకుడు ప్రాణాలు కోల్పోయాడు. నిశ్చితార్థం జరిగిన మరుసటి రోజే యువకుడు చనిపోవడం కుటుంబంలో తీవ్ర విషాదం నింపింది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడలోని సరస్వతినగర్‌కు చెందిన వింజం లక్ష్మీనారాయణ (28) తన కుటుంబంతో కూకట్‌పల్లి సమీపంలోని హైదర్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈ నెల 15న లక్ష్మీనారాయణకు నిశ్చితార్థం జరిగింది. మార్చి 13న పెళ్లికి ముహూర్తం నిర్ణయించారు. లక్ష్మీనారాయణకు పంటి నొప్పి ఉండటంతోపాటు కింది వరుస పళ్లను సరిచేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. దీనికోసం ఆన్‌లైన్‌లో చూడగా జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 37లోని ఎఫ్ఎంఎస్ డెంటల్ దవాఖాన గురించి తెలిసింది. నిశ్చితార్థం జరిగిన మరుసటి రోజు ఈ నెల 16న మధ్యాహ్నం 1.30 ప్రాంతంలో ఇంటి నుంచి బయలుదేరి ఎఫ్ఎంఎస్ డెంటల్ క్లినిక్‌కు వెళ్లాడు. రూట్ కెనాల్ చికిత్స చేయించుకున్న తర్వాత కింది వరుసలో దంతాలు వంకరటింకరగా ఉన్నాయని, వాటిని సరిచేయాలని లక్ష్మీనారాయణ కోరాడు. దీనికోసం తమ వద్ద లేజర్ ట్రీట్‌మెంట్ ఉంటుందని చెప్పగా.. చికిత్సకు అంగీకరించాడు. చికిత్స అనంతరం తీవ్రమైన నొప్పితోపాటు వాంతులు కావడంతోపాటు ఫిట్స్ వచ్చి స్పృహ తప్పి పడిపోయాడు.

లక్ష్మీనారాయణ

హుటాహుటిన అపోలో దవాఖానకు..

ఆందోళనకు గురైన ఎఫ్ఎంఎస్ దవాఖాన సిబ్బంది లక్ష్మీనారాయణను హుటాహుటిన అంబులెన్స్‌లో అపోలో దవాఖాన తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. డెంటల్ చికిత్స కోసం వెళ్లిన లక్ష్మీనారాయణ రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫోన్ చేయగా అపోలో దవాఖానలో ఉన్నట్టు తేలింది. అక్కడకు వెళ్లిచూడగా అతడి మృతదేహం కనిపించింది. గుండెపోటుతో లక్ష్మీనారాయణ మృతి చెందిఉంటాడని, డెంటల్ దవాఖాన వర్గాలు తెలిపాయి. తమకు కనీస సమాచారం ఇవ్వకుండా గోప్యంగా ఉంచడంతో ఎఫ్ఎంఎస్ డెంటల్ క్లినిక్ వైద్యుల నిర్లక్ష్యంతోనే కొడుకు మృతి చెందాడంటూ మృతుడి తండ్రి రాములు ఈ నెల 17న జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐపీసీ 304 (ఏ) సెక్షన్ కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. లక్ష్మీనారాయణ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. మృతికి గల కారణాలు తెలియాలంటే హిస్టో పాథాలజీ నివేదిక రావాల్సిందేనని, నివేదిక వచ్చిన తర్వాత తదుపరి చర్యలు ఉంటాయని పోలీసులు తెలిపారు.

पीएम श्री केंद्रीय विद्यालय करीमनगर/ Kendriya Vidyalaya Karimnagar
प्रवेश साक्षात्कार/ Walk In Interview

पीएम श्री केंद्रीय विद्यालय करीमनगर में सत्र 2024-25 हेतु संविदा/ अंशकालिक शिक्षकों का पैनल बनाने के लिए प्रवेश साक्षात्कार निम्न कार्यक्रम के अनुसार विद्यालय प्रांगण में आयोजित किया जायेगा :

साक्षात्कार दिनांक	पद
24-02-2024 (शनिवार)	पी.जी.टी. (जीव विज्ञान, हिन्दी), टी.जी.टी. (हिन्दी, विज्ञान, अंग्रेजी, गणित, सामाजिक विज्ञान), प्राथमिक शिक्षक
25-02-2024 (रविवार)	बालवाटिका शिक्षक, शैक्षिक परामर्शदाता, विशेष शिक्षक, कम्प्यूटर अनुदेशक, नर्स, गेम्स कोच

इच्छुक अभ्यर्थी शैक्षिक योग्यता आदि के विवरण एवं आवेदन पत्र का प्रारूप विद्यालय वेबसाइट https://karimnagar.kvs.ac.in/ से डाउनलोड कर पूर्ण रूप से भर कर सभी शैक्षिक, तकनीकी एवं व्यावसायिक योग्यताओं के अंक पत्रों, प्रमाण पत्रों की स्वप्रमाणित प्रति संलग्न कर उपरोक्तानुसार नियत तिथि पर 9:00 बजे से 10:00 बजे के बीच साक्षात्कार हेतु विद्यालय में उपस्थित हो। एक से अधिक पदों के लिए अलग अलग आवेदन करें।

The Walk-in interview for making contractual/part-time teachers panel for the session 2024-25 in Kendriya Vidyalaya Karimnagar will be held in the school premises as per the following schedule:

Interview Date	Post
24-02-2024 (Saturday)	PGT (Biology, Hindi), TGT (Hindi, Science, English, Maths, Social Science), Primary Teacher
25-02-2024 (Sunday)	Balvatika Teacher, Educational Counsellor, Special Educator, Computer Instructor, Nurse, Games Coach

Interested candidates should download the details of educational qualification etc. and the format of the application form from the school website https://karimnagar.kvs.ac.in/ and fill it completely and attach self-attested copies of mark sheets and certificates of all educational, technical and professional qualifications and be present in the school for interview on the above due date between 9:00 am to 10:00 am. Apply separately for more than one post.

प्राचार्य/ PRINCIPAL